క్లుప్తంగా

రైతు గుర్తింపు కార్డు తప్పనిసరి



కోస్గి రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం చేపట్టిన పథకాలన్నింటికీ రైతు గుర్తింపు కార్డు తప్పనిసరని గుండుమాల్ మండల వ్యవసాయ ఎఈఓలు తిరుపతి, నరేందర్, హర్షవర్ధన్లు అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో రైతు కార్డులతో కలిగే ఉపయోగాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి , ప్రధాత్రి ఫసల్ బీమా యోజన , రాష్ట్ర వ్యవసాయ పథకాలకు కార్డు అనుసంధానం చేసి నగదు బదిలీ చేస్తామన్నారు. రైతులందరూ ఆధార్, ఫోన్ నంబరు తప్పక అధికారులకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు ఉన్నారు.

అతిగా ఆలోచిస్తే జీవితం నాశనం



కోస్గి రూరల్: జీవితంలో కొన్ని అవసరాలు పట్టుదలను పెంచుతాయని పాలమూరు విశ్వవిద్యాలయ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివకుమార్ సింగ్ అన్నారు. శుక్రవారం గుండుమాల్ మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఉద్వేగాలు–మానసిక ఆరోగ్యం అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. భావోద్వేగాలు అదుపులో పెట్టుకొని లక్ష్యంపై దృష్టి సారించాలని, అతీగా ఆలోచించడం లక్ష్యాన్ని దూరం చేస్తాయన్నారు. మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపి జీవితాన్ని నాశనం చేస్తాయని తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను వెన్ను తట్టి ప్రోత్సాహం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిలిమవర్ధని, వార్త మల్లేషం కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ

కొత్తపల్లి: మండల పరిధిలోని ముస్లిం కుటుంబాలకు శుక్రవారం ఎంపీడీఓ కృష్ణారావ్ మండల నాయకులతో కుట్టుమిషన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలోని పెద్దాపూర్, మన్నాపూర్, కొత్తపల్లిలో అర్హులైన పేద ముస్లిం మహిళలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో కుట్టుమిషన్లు అందజేసినట్లు తెలిపారు. మహిళల ఆర్థిక ప్రగతి బాటలు వేయాలనే ఉద్దేశంతో కుట్టుమిషన్లను అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు మహేందర్‌రెడ్డి, రమేశ్ రెడ్డి, పార్థివ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మంత్రితో వాకిటి శ్రీహరి భేటీ



మక్తల్: కర్ణాటక నీటి పారుదల శాఖ మంత్రి బోసురాజు, తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడిని మంత్రి వాకిటి శ్రీహరి కలిశారు. కాంగ్రెస్ పార్టీ సమ్మేళనంలో భాగంగా హైదరాబాద్ వచ్చిన వారిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం కర్ణాటక, తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల విషయంపై చర్చించారు.

మొక్కలను సంరక్షించాలి

కోస్గి రూరల్: మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీసీబీ డైరెక్టర్, సీఎస్ఎస్ అధ్యక్షుడు తూం భీంరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రాథమిక సహకార సంఘం కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025 సందర్భంగా అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ , నాయకులు పెంట్యానాయక్ , నాగులపల్లి నరేందర్, అన్న కిష్టప్ప తదితరులు ఉన్నారు.

దివంగత మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

నారాయణపేట: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు యంత్రాంగం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీలు నల్లపు లింగయ్య, మహేష్ రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. సుదీర్ఘ కాలం ప్రజాసేవలో నిమగ్నమై రాజకీయాల్లో నైతిక విలువలు ఏంటో చూపించారని ఆయన సేవలను కొనియాడారు.

హాస్టల్ సౌకర్యం లేక అవస్థలు

- ధన్వాడ మోడల్ పాఠశాల విద్యార్థులకు తప్పని ఇబ్బందులు
- వసతులు కల్పించడంలో అధికారుల విఫలం



తెలంగాణ మోడల్ పాఠశాల

ధన్వాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వం లక్ష్యం పెట్టుకున్నా ఆ దిశగా అడుగులు మాత్రం పడడం లేదు. ముఖ్యంగా ధన్వాడ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు దీనికి నిదర్శనం. తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడంలో సఫలం కావడంతో ధన్వాడతో పాటు ఇతర జిల్లాల నుంచి విద్యార్థులు మోడల్ పాఠశాలలో చేరేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఇందుకు అనుగుణంగా మోడల్ పాఠశాలలో హాస్టల్ వసతి లేకపోడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చినా విద్యార్థులు పాఠశాలలో చేరినా రెండు రోజులకే టీసీ తీసుకొని వెళ్లిపోతున్నారు.

100 సీటక్లు చేరింది 27 మాత్రమే

ధన్వాడలోని మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో 100 సీట్లుండగా ప్రవేశాల కోసం ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు పెట్టి ఏటా ఎంపికలు నిర్వహిస్తుంటారు. అయితే పాఠశాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో పాటు హాస్టల్ వసతి కూడా లేకపోవడంతో ఈ సంవత్సరం 6వ తరగతిలో కేవలం 27 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. కేవలం ఇంటర్ విద్యార్థులకు మాత్రమే అది కూడా బాలికలకు మాత్రమే హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల స్థాయి విద్యార్థులు తమకు కూడా హాస్టల్ వసతి కల్పించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు రవాణా కష్టాలు..

తెలంగాణ మోడల్ పాఠశాలను ధన్వాడకు రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. దీంతో విద్యార్థులకు రోజూ నాలుగు కిలోమీటర్ల నడక తప్పడం లేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హాస్టల్ వసతి కేవలం ఇంటర్ విద్యార్థులకే మాత్రమే ఉంది. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వసతి లేదు. దీంతో రోజూ ధన్వాడ బస్టాండ్ వరకు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి బస్‌లో తమ సొంత గ్రామాలకు వెళ్తున్నారు. ఇంటికి చేరుకునే సరికి చీకటి పడుతుండడంతో చదువుకోవడానికి సమయం సరిపోవడం లేదని విద్యార్థులు చెబుతున్నారు.

ఎస్సీ హాస్టల్ ఫుల్..

ధన్వాడ మండల కేంద్రంలో కేవలం ఎస్సీ హాస్టల్ మాత్రమే ఉంది. ఇందులో కేవలం 7 గదులు మాత్రమే ఉండటంతో అందులో 260 మంది విద్యార్థులు ఉన్నారు. ఒక గదిలో దాదాపు 30 మంది విద్యార్థులు ఉండటంతో రాత్రి పడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీ హాస్టల్ మాత్రమే అందుబాటులో ఉండటంతో బీసీ, ఎస్టీ విద్యార్థులు అందులో చేరేందుకు అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఇంకో జనరల్ హాస్టల్ కడితే ఉపయోగంగా ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉదయం 6 గంటలకు ప్రయాణం



మాది నారాయణపేట మండలంలోని లక్ష్మీపూర గ్రామం. పాఠశాలకు రావాలంటే ఉదయం 5 గంటలకు లేచి రెడీ అయి లక్ష్మీపూర్ నుంచి చిన్నజట్రాం వరకు రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వచ్చి అక్కడి నుంచి ధన్వాడ వరకు బస్సులో వచ్చి ధన్వాడ నుంచి మరో రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ పాఠశాలకు రావాల్సి వస్తుంది. ధన్వాడలో బీసీ హాస్టల్ ఏర్పాటు చేస్తే మాకు నడక కష్టాలు తీరుతాయి.

– నందకిషోర్, 9వ తరగతి

హాస్టల్ వసతి కల్పించాలి



మాది కంసాన్‌పల్లి గ్రామం. మా గ్రామం నుంచి పాఠశాల వరకు రోజూ 5 కిలోమీటర్లు నడుచుకుంటూ రావాల్సి వస్తుంది. అదే గ్రామం నుంచి పాఠశాలకు బస్ సౌకర్యం కల్పిస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. లేకపోతే పాఠశాలలోనే హాస్టల్ వసతి కల్పిస్తే ఇక్కడే ఉండి చదువుకోవడానికి వీలుగా ఉంటుంది.

– అనూష, 10వ తరగతి

బస్సు సౌకర్యం కల్పించేలా చూస్తాం



ధన్వాడకు రెండు కిలోమీటర్ల దూరంలో పాఠశాల ఉండటంతో విద్యార్థుల తల్లితండ్రులు పాఠశాలలో చేర్పించేందుకు వెనుకంజ వేస్తున్నారు. అంతే కాకుండా పాఠశాలకు వచ్చే మార్గంలో వైన్ షాపులు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మండలంలోని వివిధ గ్రామాలలో బాటిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నాం. పాఠశాల వరకు రోడ్డు వేసి బస్సు సౌకర్యం కల్పించేలా చూసుకుంటాం.

– ఉమా ఆశ్రా, ప్రిన్సిపాల్, ధన్వాడ మోడల్ పాఠశాల

మెనూ ప్రకారం భోజనం అందించాలి



గురుకుల విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల, మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలను శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. పాఠశాలను అద్దె భవనంలో కొనసాగిస్తుండడంతో విద్యారులు పడుతున్న అవస్థల గురించి ప్రిన్సిపల్ కలెక్టర్‌కు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. అనంతరం పది, ఇంటర్ తరగతులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే మెనూ ప్రకారం భోజనం అందిచాలని ఆదేశించారు.

ప్రభుత్వ భూమిని రక్షించండి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని 58 సర్వే నంబరులో 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. మండలకేంద్రంలో గతేడాది ప్రధాన రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చే క్రమంలో రోడ్లకు ఆనుకొని భూములను చదును చేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన కొందరు రైతులు సదరు భూమిపై కన్ను వేసి కబ్జా చేశారు. ఇటీవల హరితా హారంలో భాగంగా ఆభూమిలో అధికారులు మొక్కలు నాటారు. అయితే కబ్జాదారులు గుంతలను తిరిగి ట్రాక్టర్లతో చదును చేశారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. దీనిపై తహసీల్దార్ వివరణ కోరగా కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటాం. ప్రభుత్వ భూముల్లో అనుమతులు లేకుండా మట్టి తరలించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కోస్గి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడంలో అధికారులు విఫలమయ్యారని బీజేపీ మండల, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ విమర్శించారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డు సంపల్లి గ్రామంలో ఒక్కరికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాలేదని శుక్రవారం మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. మిగతా వార్డులలో ఇళ్లు మంజూరై నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు , అధికారుల నిర్లక్ష్యంతోనే 4వ వార్డులో లబ్ధిదారులు ఉన్న ఇళ్లు మంజూరు చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

నారాయణపేట: మక్తల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌రూంలో వంట సామగ్రి, నిత్యావసర సరుకుల నాణ్యత, వంట గదిలో శుభ్రత, భోజన తయారీని పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా? లేదా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల, కళాశాలకు సంబంధించిన పలు రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అలాగే జిల్లా కేంద్రంలోని సత్యనారాయణ స్వామి ఆలయం సమీపంలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, యాద్గిర్ రోడ్‌లోని మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలను శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలు, రికార్డులు, స్వచ్ఛత, వంటగది, స్టోర్‌రూమ్ పరిశీలించారు. పాఠశాలలో 100 శాతం ఫలితాలు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

ఆటోడ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాగనూర్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆటో డ్రైవర్లు

మాగనూర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించినట్లు ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా నాయకులు అంజనేయులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఆర్థిక భృతి అందించాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న పెట్రోల్, డిజీల్ ధరల వల్ల ఆటోల ద్వారా వచ్చే సంపాదన కుటుంబ పోషణకు సరిపోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలోఆటో యూనియన్ నాయకులు నామలి తిమ్మప్ప, కోల్పూర్ రాజు, తండిగి హన్మంతు, కోల్పూర్ వెంకటేష్ పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు



స్టాక్ రిజిస్ట్రార్‌ను పరిశీలిస్తున్న సుదర్శన్‌గౌడ్

మాగనూర్: నకిలీ విత్తనాలు అలాగే కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు అమ్మి రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలోని సీడ్స్, ఫర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్‌లు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ షాపు నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నకిలీ విత్తనాలు సరఫరా చేసే దళారులు రైతులను సంప్రదిస్తే వెంటనే పోలీసులకు గానీ అగ్రికల్చర్ అధికారులకు గానీ సమాచారం అందిస్తే వారిపై కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

రోడ్లు, డ్రెయినేజీ ఏర్పాటు చేయండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీ వాసులు

నారాయణపేట: పట్టణంలోని అశోక్ నగర్‌లో కనీస వసతులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ భోగేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ ఏర్పడి దాదాపు 8 ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సౌకర్యం కల్పించలేదన్నారు. బీసీ కాలనీ నుంచి వచ్చే మురికి నీరు, వరద డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్ల మధ్యలో నీరు నిలుస్తూ ఇబ్బందులు పడుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్పందించి కనీస వసతులు కల్పించాలని కోరారు.

విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి

ఊట్కూరు: ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలలో 25 శాతం సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగుబలహీన వర్గాలకు కేటాయించి ఉచితంగా విద్యను అందించాలని కోరారు. అలాగే ప్రైవేటు పాఠశాలలో యాజమాన్యం ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తుందని అయినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ఫీజుల దోపిడీని అరికట్టి పేద విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలి

కోస్గి : ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వాడాలని మున్సిపల్ మేనేజర్ అనిల్‌కుమార్ అన్నారు. గురువారం 100 రోజుల కార్యాచరణలో భాగంగా పట్టణంలోని 6వ వార్డులో ర్యాలీ చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడితే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో హెల్త్‌అసిస్టెంట్ మోహిన్‌బాషా, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది , కార్మికులు ఉన్నారు.

బకాయి నిధులు విడుదల చేయాలి



మక్తల్: బెస్టు అవలేబుల్ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా దళిత విద్యార్థులకు రూ.200 కోట్లు విడుదల చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు మూడేళ్ల నుంచి నిధులు విడుదల చేయలేదని దీంతో దాదాపు రూ.200 కోట్ల వరకు బకాయి ఉందన్నారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పృథ్వీరాజ్, తల్వార్, నరేస్, తేజ తదితరులు పాల్గొన్నారు.

బాలకేంద్రంలో కలెక్టర్ కుమారుడు



నారాయణపేట రూరల్: నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ కుమారుడు జిల్లా కేంద్రంలోని బాలకేంద్రంలో శిక్షణకు హాజరయ్యాడు. మాస్టర్ సారంగ్ పట్నాయక్ కీ బోర్డ్ రిదం ప్యాడ్ నేర్చుకునేందుకు శుక్రవారం నుంచి బాల కేంద్రానికి వచ్చాడు. సాధారణ విద్యార్థిగా బాలకేంద్రానికి రావడంతో తోటి పిల్లలు ఆనందం వ్యక్తం చేశారు.

పరిశుభ్రతపై అవగాహన

మక్తల్: మక్తల్ మున్సిపాలిటీలో శుక్రజువారం డ్రైడే.. ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. ఈసందర్భంగా మూడో వార్డులో కమ్యూనిటీ హాల్, కేంచమ్మ దేవాలయం సమీపంలో దోమల మందును పిచీకారి చేశారు. అనంతరం పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమీషనర్ శంకర్ నాయక్ , కార్మికులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత



నారాయణపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సు, ఎంఎల్‌హెచ్‌పీ అభ్యర్థులకు ఎట్టకేలకు అధికారులు నియామకపత్రాలు అందజేశారు. జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ నేతృత్వంలో జిల్లా సెలక్షన్ కమిటీ అభ్యర్థులకు శుక్రవారం ఆర్డర్‌కాపీలను అందజేసింది. 21 స్టాఫ్ నర్సు, 5 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు మొత్తం 78 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లను గత నెల 24న ధ్రువపత్రాల పరిశీలన జరగగా తాజాగా 26 మందికి నియామకపత్రాలు అందజేశారు.

పేకాట స్థావరంపై దాడి

నర్వ: మండలంలోని పాథర్చేడ్ గ్రామ శివారులో ఓ పేకాట స్థావరం నిర్వహిస్తుండగా పోలీస్‌లు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా జంగంరెడ్డిపల్లికి చెందిన ముష్టిపల్లి శేఖర్ వ్యవసాయ పొలంలో చెట్టుకింద జంగంరెడ్డిపల్లికి చెందిన దుప్పల్లి సాయి, మెట్లగోపాల్, మెట్లబాబు, మెట్లభగవంతు, జట్రం నందులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దొడ్డి కొమురయ్య సేవలు మరువలేనివి

నారాయణపేట: దొడ్డి కొమురయ్య సేవలు మరవలేనివని సీఐటీయూ నాయకులు తెలిపారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు.

10న గురుపూర్ణిమ వేడుకలు

నారాయణపేట రూరల్: పట్టణంలోని సద్గురు అవధూత నరసింహ స్వామి మఠంలో ఈనెల 10వ తేదీన గురు పూర్ణిమను పురస్కరించుకొని విశేష గురు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 9న ఉదయం 6గంటల నుంచి గురు చరిత్ర పారాయణం 10న ఉదయం రుద్రాభిషేకం, బిళ్వార్చన, గురుపాదుక పూజ, మృత్యుంజయ గురు గాయత్రి మహాయజ్ఞం మధ్యాహ్నం 12గంటలకు పల్లకి సేవా అనంతరం మహా మంగళ హారతి అన్నప్రాసద వితరణ ఉంటుందని తెలిపారు. భక్తులు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. గురు చరిత్ర పారాయణంలో పాల్గొనే భక్తులు 70136 87745 నంబర్‌ని సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఫోరెన్సిక్ పరీక్షలో కృష్ణా ఎస్ఐ ప్రతిభ



కృష్ణా: నాగర్ కర్నూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఫోరెన్సిక్ సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్ గద్వాల్ జోగులాంబ జోన్–7 రాత పరీక్షలో కృష్ణా ఎస్ఐ ఎండీ నవీద్ ఉత్తీర్ణత సాధించి అవార్డు సాధించినట్లు స్టేషన్ సిబ్బంది తెలిపారు. ఈ విషయంపై ఎస్ఐ నవీద్ మాట్లాడుతూ జోనల్‌వైజ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న పరీక్షకు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డిఐజీ చౌహాన్ ఎస్ఐ నవీద్‌కు అవార్డు అందజేసి అభినందనలు తెలిపారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే రాత పరీక్షలోనూ రాణించి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆమె కృషి అభినందనీయం

- ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచిన పంతులమ్మ
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



విద్యార్థులతో నాజీయాబేగం

మక్తల్: మన సమాజంలో తల్లిదండ్రుల తర్వాత అంతటి గుర్తింపు ఒక్క గురువుకే ఉంటుంది. దీనికి సరైన అర్థాన్ని ఇస్తూ మండలంలోని రామసముద్రం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న నాజీయాబేగం తన పనితీరుతో గ్రామస్తులందరికీ ఆదర్శంగా నిలిచారు. ప్రస్తుతం ఏ తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను సర్కార్ బడుల్లో చదివించడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ క్రమంలో నాజీయాబేగం ఇంటింటికి తిరిగి తల్లిదండ్రులకు మాట ఇచ్చి వారి పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించేలా కృషి చేశారు.

3 నుంచి 21కు పెరిగిన విద్యార్థులు

రామసముద్రం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధన సక్రమంగా లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. నాజీయాబేగం రెండేళ్ల క్రితం ఈ పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆమె ఇక్కడికి బదిలీ అయినప్పుడు పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులే ఉన్నారు. దీంతో ఎలాగైనా విద్యార్థుల సంఖ్యను పెంచాలనుకొని గ్రామస్తులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పిల్లలకు మెరుగైన విద్యాబోధన అందిస్తానని మాట ఇచ్చి తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. ఈ క్రమంలో ప్రస్తుతం విద్యార్థుల సంఖ్య 3 నుంచి 21కు చేరుకుంది. గ్రామస్తులకు ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులకు ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన అందేలా కృషి చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే విద్యార్థుల చేరిక

రామసముద్రం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంలో గ్రామస్తుల సహకారం మరవలేనిది.గ్రామంలో మొత్తం 70 కుటుంబాలు ఉండగా 21 మంది పిల్లలు స్థానిక ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్నారు. ప్రభుత్వ బడిలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన గురించి తల్లిదండ్రులకు వివరించి కృషి చేయడంతో విద్యార్థుల సంఖ్యను పెంచగలిగాను.

–నజీయాబేగం, హెచ్ఎం , రామసముద్రం